


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 10-06-2026 సంపుటి: 08 సంచిక 01 పేజీలు: 8 వెల: రూ 3-00


# 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలపై సీఎం ఫోకస్..

## డేటా డ్రివెన్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యం



అమరావతి, జూన్ 9 : జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్న సూచికలను మెరుగుపరచడం, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా లక్ష్యాలను చేరుకోవటమే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. నిర్దేశించుకున్న లక్ష్యాలతో పాటు రియల్ గ్రోత్ ఆధారంగా పనితీరును అంచనా వేసేలా స్కోరింగ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈరోజు (మంగళవారం) రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు, కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లపై సచివాలయంలో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో సమీక్షకు ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, ఉద్యాన, రవాణా, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి వివిధ ప్రభుత్వ శాఖలకు కీ పెర్ఫార్మెన్సు ఇండికేటర్లను నిర్దేశించారు. రాష్ట్ర- క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని నిర్ణయించామని సీఎం చంద్రబాబు తెలిపారు. మౌలిక సదుపాయాలపై చేసే వ్యయం 3.5 రెట్ల మేర ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించేలా ఉండాలని దిశానిర్దేశం చేశారు. రియల్ టైమ్‌లో ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నామని అన్నారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా డ్రివెన్ గవర్నెన్సుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు.. సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రతీ రంగంలోనూ గ్రాస్ వాల్యూ అడిషన్ పెంపుదల చేసేందుకు శ్రద్ధ పెట్టాలని మార్గనిర్దేశం చేశారు. తయారీ, గనులు, వాణిజ్యం, రవాణా తదితర రంగాలతో పాటు అమరావతి, పోలవరం, పోర్టులు, ఎయిర్ పోర్టులతో ఆర్థిక వ్యవస్థకు మల్టిప్లైయర్ ఎఫెక్ట్ వచ్చేలా చర్యలకు సూచించారు. కేపీఐలు మెరుగ్గా ఉంటే... వృద్ధి రేటు పెరుగుతుందని సీఎం చంద్రబాబుపేర్కొన్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులకు మంత్రి లోకేశ్ పరామర్శ



విశాఖపట్నం, జూన్ 9: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. ఈరోజు(మంగళవారం) ఉదయం కేజీహెచ్ ఆస్పత్రికి చేరుకున్న మంత్రి.. మార్చురీలో ఎంతమంది ఉన్నారనే దానిపై జాయింట్ కలెక్టర్ విద్యాధరిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో చనిపోయిన ఎమినిది మంది బంధువులను పరామర్శించారు. వారి నుంచి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆపై సెవెన్ హిల్స్ ఆస్పత్రికి మంత్రి వెళ్లారు. స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సూరిబాబు, పైడిరాజు, వి.శ్రీనివాసరావు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని, ఆసుపత్రిలో అందుతున్న చికిత్సను వైద్యులను అడిగి తెలుసుకున్నారు లోకేశ్. అనంతరం గాయపడిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని లోకేశ్ చెప్పారు. మంత్రి లోకేశ్‌తో పాటు కేంద్రమంత్రి భూపతి రాజు, హోంమంత్రి అనిత, ఎంపీ భరత్, పల్లా శ్రీనివాసరావు.. బాధితులను పరామర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం జరిగింది. లాడిల్ నుంచి ద్రవ ఉక్కు బకెట్లు కింద పడిపోయాయి. పలువురు కార్మికులపై ద్రవ ఉక్కు పడి అక్కడికక్కడే బూడిదయ్యారు. ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోయి గుర్తుపట్టలేని విధంగా మారాయి. అటు ఎనిమిది మృతదేహాలను పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. మృతదేహాలను గుర్తించేందుకు మృతుల బంధువుల శాంపిల్స్‌ను తీసుకుని ల్యాబ్‌కు పంపిస్తామని వైద్యులు చెబుతున్నారు. డీఎన్ఏ పరీక్షలు పూర్తయ్యేందుకు నాలుగు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారు విశాఖలోని కిమ్స్, సెవెన్ హిల్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.



# పార్లమెంటులో స్పెషల్ మెజారిటీ కోసం ఎన్డీయే ప్రయత్నాలు!




న్యూ ఢిల్లీ, పార్లమెంటులో కూడా టీఎంసీ ఎంపీలు తిరుగుబాటు బావుటా ఎగరవేయవచ్చున్న వార్తల నడుమ మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గ పునర్విభజన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. త్వరలో లోక్‌సభలో కూడా ఎన్‌డీఏ మూడింట రెండు వంతుల స్పెషల్ మెజారిటీ సాధించే అవకాశం ఉందని జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇటీవల అధికార పార్టీ ప్రవేశపెట్టిన బిల్లు వీగిపోయిన విషయం తెలిసిందే. ఏప్రిల్‌లో ఈ బిల్లుపై లోక్‌సభలో జరిగిన ఓటింగ్‌లో మొత్తం 528 మంది ఎంపీలు పాల్గొన్నారు. దీంతో, స్పెషల్ మెజారిటీ మార్కు 352గా మారింది. ఇందులో 298 మంది ఎంపీలు బిల్లుకు అనుకూలంగా ఓటు వేయగా 230 మంది ఎంపీలు వ్యతిరేకించారు. అనుకూల ఓట్లు మేజిక్ ఫిగర్‌ను (352 ఓట్లు) దాటకపోవడంతో బిల్లు వీగిపోయింది. స్పెషల్ మెజారిటీ సాధించాలంటే ఓటింగ్‌లో పాల్గొనే సభ్యులలో మూడింట రెండు వంతుల (2/3) మంది బిల్లుకు మద్దతు ఇవ్వాలి. వీరి సంఖ్య సభ మొత్తం సభ్యుల సంఖ్యలో (543) సగానికి పైగా ఉండాలి. ఈ రెండూ కుదిరితేనే స్పెషల్ మెజారిటీగా పరిగణిస్తారు. పార్లమెంటు వేదికగా తృణమూల్‌లో చీలిక తప్పదన్న అంచనాలు వెలువడుతున్న నేపథ్యంలో అధికార ఎన్‌డీఏ కూటమి సంఖ్యాబలం స్పెషల్ మెజారిటీకి మరింత చేరువ అవుతుందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. తనకు 20 ఎంపీల మద్దతు ఉందని టీఎంసీ ఎంపీ కాకోలీ ఘోష్ దస్తీదార్ పేర్కొన్నారు. చట్టప్రకారం టీఎంసీలో చీలిక తెచ్చేందుకు ఆయనకు మరో ఎంపీ మద్దతు అవసరం. తరువాత వీరంతా లోక్‌సభలో ఒక బృందంగా ఎన్డీయేకు మద్దతు పలికే అవకాశం ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇదే జరిగితే ఎన్‌డీఏ సంఖ్యా బలం 300 మార్కు దాటుతుంది. ఇక డీఎంకే ఎంపీలు కూడా ఎన్‌డీఏకు కొన్ని షరతులకు లోబడి మద్దతు ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఎన్‌డీఏకు ప్రస్తుతం లోక్‌సభలో 293 మంది ఎంపీలు ఉన్నారు. 20 మంది టీఎంసీ ఎంపీలు మద్దతు కూడా లభిస్తే సంఖ్యాబలం 313కు పెరుగుతుంది. 22 మంది డీఎంకే ఎంపీల మద్దతూ సాధించగలిగితే ఇది 335కు చేరుతుంది. మహారాష్ట్ర నేత ఉద్ధవ్ థాకరే సారథ్యంలోని శివసేనకు చెందిన 9 మంది ఎంపీల మద్దతును కూడగట్టేందుకూ ప్రయత్నాలు సాగుతున్నాయి. వీరిలో కొందరి మద్దతు లభించినా ఎన్‌డీఏ సంఖ్యా బలం 341కు పెరుగుతుంది. మిగిలిన ఓట్లను చిన్న పార్టీలు, స్వతంత్ర ఎంపీల రూపంలో సాధించుకోవచ్చని ఎన్‌డీఏ భావిస్తున్నట్టు సమాచారం. రాజ్యసభలో కూడా మూడింట రెండు వంతుల స్పెషల్ మెజారిటీని (164) కూడగట్టేందుకు ఎన్‌డీఏ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే టీఎంసీ రాజ్యసభ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన మళ్లీ ఎన్నికై బీజేపీకి మద్దతు పలికే ఛాన్స్ ఉందన్న టాక్ వినిపిస్తోంది. మిగిలిన 12 టీఎంసీ ఎంపీలు ఇదే ఫార్ములా ఫాలో అయ్యే అవకాశం ఉంది. 8 మంది డీఎంకే ఎంపీలు కూడా షరతులకు లోబడి ఎన్‌డీఏ ఈ బిల్లు విషయంలో మద్దతు తెలిపే ఛాన్సు ఉంది. ఇతర చిన్న పార్టీల మద్దతు కూడా కూడగడితే పెద్దల సభలో కూడా ఎన్‌డీఏ పైచేయి సాధించే ఛాన్స ఉన్నట్టు సమాచారం.

# రొయ్యల రైతుల సంక్షేమం, ఆక్వాకల్చర్ రంగాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఫీడ్ ధరల అంశంపై రైతులు, తయారీదారులు పరస్పర అంగీకారంతో ముందుకు రావాలి
- అదనంగా 12 వేల ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లకు యూనిట్‌కు రూ.1.50 రాయితీ
- ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి/విజయవాడ, జూన్ 9: రాష్ట్రంలో ఆక్వాకల్చర్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రొయ్యల రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో రొయ్యల రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, సముద్ర ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులు తదితర రంగ ప్రతినిధులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రొయ్యల ఫీడ్ ధరల పెరుగుదలపై రైతులు, పరిశ్రమ వర్గాలు తమ అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చాయని మంత్రి తెలిపారు. ఫిష్‌మీల్, సోయాబీన్ తదితర ముడి పదార్థాల ధరలు పెరగడంతో ఉత్పత్తి వ్యయాలు అధికమయ్యాయని తయారీ సంస్థలు వివరించగా, ఇప్పటికే ఖర్చుల భారం పెరిగిన నేపథ్యంలో ధరల పెంపును నియంత్రించాలని రైతులు కోరినట్లు చెప్పారు. ఆక్వాకల్చర్ రంగ సమగ్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రైతులు, తయారీదారులు చర్చల ద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారానికి రావాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు. ఇరు వర్గాలు ఏకాభిప్రాయానికి వచ్చిన తర్వాత తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. ఫీడ్ ధరల నిర్ణయంలో శాస్త్రీయ విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమైనట్లు మంత్రి వెల్లడించారు. ముడి పదార్థాల ధరలు, టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ)తో పాటు మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తులో పారదర్శక ధరల వ్యవస్థ ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు. ఆక్వాకల్చర్ రైతులకు విద్యుత్ రాయితీపై మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి అదనంగా 12 వేల ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున రాయితీ అందించే ప్రక్రియ తుది దశలో ఉందన్నారు. ఉత్తర్వులు జారీ అయిన తర్వాత అర్హత కలిగిన అన్ని ఆక్వాకల్చర్ కనెక్షన్లు అవి చిన్న, పెద్ద ఫారాలు అయినా, ఆక్వా జోన్ లేదా నాన్-ఆక్వా జోన్‌లో ఉన్నా ఈ పథకం పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో ఉత్పత్తి వ్యయం తగ్గడంతో పాటు రైతులకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందని తెలిపారు. మత్స్య, ఆక్వాకల్చర్ రంగాల్లో స్థిరమైన అభివృద్ధి, పోటీతత్వ సామర్థ్యాల పెంపు, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు.






# సంపాదకీయం

బుధవారం 10-06-2026

## మోడీ సరికొత్త రికార్డ్...

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తాజాగా సరికొత్త రికార్డు సృష్టించారు. దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన ప్రధాన మంత్రిగా ఇప్పటి వరకు ఉన్న అన్ని రికార్డులను ఆయన తిరగరాశారు. దేశంలో ఒక్క ఒక్కడుగా ఆయన చరిత్ర సృష్టించారు. గతంలో మాజీ ప్రధాని ఇందిర పేరిట ఉన్న రికార్డును కొన్నాళ్ల కిందట అధిగమించిన మోడీ.. ప్రస్తుతం ఆమె తండ్రి, భారత తొలిప్రధాన మంత్రి చాచా నెహ్రూను కూడా పాలనలో అధిగమించారు. దేశానికి ప్రధాన మంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన నాయకుడిగా మోడీ సంచలన రికార్డును సొంతం చేసుకున్నారు. ఈ నెల 10వ తేదీ నాటికి.. మోడీ.. దేశానికి ఎక్కువ కాలం ప్రధానిగా పనిచేసి నేత చరిత్ర సృష్టించనున్నారు. భారతదేశ రాజకీయ, పరిపాలనా చరిత్రలో 2026 జూన్ 10 ఒక సువర్ణ అధ్యాయంగా లిఖించబోతుంది. దేశాన్ని నిరంతరాయంగా అత్యధిక కాలం పాలించిన తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న చారిత్రక రికార్డును ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర వోదీ ఈ రోజున అధికారికంగా అధిగమించనున్నారు. 2014 మే 26న తొలిసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. ఇప్పటి వరకు నిరాఘాటంగా ఆ పదవిలోనే ఉన్నారు. 2014, 2019 ఎన్నికల్లో దేశవ్యాప్తగా బీజేపీ ప్రభంజనం సృష్టించి.. మోడీ ప్రధాని అయ్యే అవకాశం కల్పించింది. ఇక, 2024లో బీజేపీకి ఒంటరిగా సీట్లు తగ్గినప్పటికీ.. మిత్రపక్షాలైన టీడీపీ, జేడీయూ, జనసేన సహా.. అనేక చిన్నా చితకా పార్టీల మద్దతుతో మోడీ ముచ్చటగా మూడోసారి ప్రధాని పీఠాన్ని అలంకరించారు 12 ఏళ్లలో తమ ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలను ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం ప్రముఖంగా ప్రస్తావించారు. భారతదేశం అనేక పరివర్తనలకు సాక్ష్యంగా నిలిచిందని, ఈ మార్పుల్లో ప్రధానమైనది పేద, అణగారిన వర్గాల ప్రజల సంక్షేమేనని అన్నారు. ప్రధాని మోడీ వరుసగా మూడో సారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ, స్వచ్ఛ భారత్, పిఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాలను ఉదహరించిన మోడీ, ప్రజలకు గౌరవం, అవకాశాలు దక్కేందుకు తమ ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డుతుందన్నారు. తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ 'అంత్యోదయ' నుండి ప్రేరణ పొందిందని, దశాబ్దాలుగా వెనుకబడిన వారికి అభివృద్ధి ద్వారా వచ్చే ప్రయోజనాలు చేరేలా చూడటమే తమ లక్ష్యమని ప్రధాని అన్నారు. పేదలకు మెరుగైన జీవన నాణ్యతను అందించడంలో సాంకేతికత కీలక పాత్ర పోషించడం కూడా ఆనందంగా ఉందన్నారు. లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు, డిజిటల్ వేదికల ద్వారా మద్దతు ప్రజలకు ప్రత్యక్షంగా, పారదర్శకంగా చేరుతోందన్నారు. 'ఇది లీకేజీలను తగ్గించింది, సామర్థ్యాన్ని మెరుగుపరిచింది మరియు పాలనపై నమ్మకాన్ని బలోపేతం చేసింది. ఈ విధంగా 'గరీబ్ కల్యాణ్' ను ముందుకు తీసుకెళ్లే ప్రయాణం మానవ సాధికారత దిశగా, మన వికసిత్ భారత్ కలను సాకారం చేసే దిశగా సమిష్టి ఉద్యమంగా మారింది' అని ప్రధాని పేర్కొన్నారు. 2024 పార్లమెంటరీ ఎన్నికలలో విజయం సాధించిన తరువాత, జూన్ 9,2024న మోడీ వరుసగా మూడోసారి దేశ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2014 మే 26న తొలిసారిగా ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన రెండవ పదవీకాలం 2019 మే 30న ప్రారంభమైంది. గతంలోనూ మూడు సార్లు ప్రధాని అయిన వారు ఉన్నా.. వరుసగా.. ప్రధాని కావడం, సుదీర్ఘకాలం వరుసగా పాలన సాగించే విషయాల్లో మోడీనే ఫస్ట్ నిలిచారు. 2014, మే 26న తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోడీ నెల 10వ తేదీ నాటికి వరుసగా 4,399 రోజుల పాలనను పూర్తి చేసుకోనున్నారు. ఇది దేశంలోనే అత్యధిక రికార్డు. 1952.. మే 13న దేశ తొలి ప్రధానిగా నెహ్రూ ప్రమాణం చేశారు. ఆయన 1964, మే 27న మరణించే వరకు వరుసగా 4,398 రోజుల పాటు ఆ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును మోడీ తోసిపుచ్చి.. తానే సరికొత్త రికార్డును సృష్టించారు. బుధవారం నాటికి మోడీ 4,399 రోజులపాటు వరుసగా పీఎం సీటులో కూర్చున్న ఏకైక నేతగా నిలిచారు. ఇక, ఇందిరమ్మ విషయానికి వస్తే.. మధ్యలో ఓడినా.. మొత్తంగా 4077 రోజుల పాటు భారత దేశానికి ఏకైక మహిళా ప్రధానిగా పనిచేశారు. అయితే.. ఈ రికార్డును గత ఏడాదే మోడీ అధిగమించారు. 2025, జులై 25న 4,078 రోజుల నిరంతరాయ పాలన రికార్డును మోడీ నమోదు చేయడం గమనార్హం. భారతదేశం 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షల దేశం. మన యువ జనాభా, పెరుగుతున్న మధ్యతరగతి, విస్తరిస్తున్న మౌలిక సదుపాయాలు భారతదేశ వృద్ధికి చోదక శక్తులుగా ఉన్నాయి. గత 12 సంవత్సరాలుగా, భారతదేశం 'సంస్కరించు, సాధించు, పరివర్తన చెందు' అనే నినాదంతో నరేంద్ర మోడీ ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రభుత్వ రాజకీయ సంకల్పంతో, ఈ సంస్కరణల రథం పూర్తి వేగంతో దూసుకుపోతోంది. నేడు భారతదేశానికి ప్రతిష్ట, విస్తృతి, డిమాండ్, స్థిరత్వం, అన్నింటికంటే ముఖ్యంగా 140 కోట్ల మంది భారతీయుల సంకల్పం ఉన్నాయి. అందువల్ల, సంకల్పంతో కూడిన పెట్టుబడుల వైపు అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఇక ఇప్పటి వరకు ప్రధాని మోదీ 44 అంతర్జాతీయ గుర్తింపులు సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో ఏదేశాధినేతకు దక్కని గౌరవం నరేంద్ర మోదీకి దక్కింది. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశానికి పునాదులు వేయడం నెహ్రూ కాలపు అవసరమైతే.. భారీ ప్రభుత్వ ప్రణాళికల నుండి చురుకైన, సాంకేతికత ఆధారిత పంపిణీ వ్యవస్థ ద్వారా భారతదేశాన్ని ఒక అంతర్జాతీయ ఆర్థిక శక్తిగా నిలపడం ప్రధాని మోదీ పదవీకాలపు ముఖ్య లక్షణంగా నిలిచింది. 2026 బుధవారం మోదీ దాటనున్న ఈ చారిత్రాత్మక మైలురాయి, ఇరవై ఒకటవ శతాబ్దపు నవ భారత పరిపాలనకు ఒక స్పష్టమైన నిర్వచనాత్మక నమూనా. మోడీ సాధించిన ఈ రికార్డును అధిగమించే పరిస్థితి కనుచూపు మేరలో ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం.

## జీతాలు ఇవ్వకుండా వేధింపులు.. కాంగ్రెస్ సర్కార్‌కు అంగన్ వాడీల ఉసురు తగులుతుంది : హరీశ్ రావు

మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని మభ్యపెడుతున్న రేవంత్ రెడ్డి.. ముందు అంగన్ వాడీలకు జీతాలు చెల్లించి, మహిళల పట్ల నీకున్న గౌరవాన్ని నిలబెట్టుకో అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు హితవు పలికారు. ఈ మేరకు హరీశ్ రావు ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు నెలలుగా జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62వేల అంగన్ వాడీ సోదరీమణుల కష్టాలు మీకు కనిపించడం లేదా..? నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా అంగన్ వాడీలను వేదిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు



తగులుందన్నారు. మహిళా మంత్రిగా ఉన్న సీతక్క సాటి మహిళల కన్నీటి గోస అర్థం చేసుకోకపోవడం శోచనీయమని హరీశ్ రావు పేర్కొన్నారు. అంగన్ వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారు వర్కర్లు కాదని, అంగన్ వాడీ టీచర్లు అని పోస్టును ఉన్నతీకరించారు. వారి గౌరవాన్ని పెంచారు. 2014 నాటికి అంగన్ వాడీ టీచర్లకు కేవలం రూ. 4,200, వారి సహాయకులకు రూ. 2,200 వేతనం లభించేది. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ. 13,650లకు, మినీ అంగన్ వాడీ టీచర్ల వేతనాన్నిరూ. 7,800లకు, అంగన్ వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ. 7,800 లకు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించారన్నారు. అభయహస్తం పేరిట ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని 18,000లకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రకటించారు. మాయ మాటలు చెప్పి, రెండున్నరేండ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీకి అతీ లేదు, గతీ లేదు. ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం, అధికారంలోకి వచ్చాక అబద్దాలు ప్రచారం చేసుకుంటం అన్నట్లుంది కాంగ్రెస్ వైఖరి అని హరీశ్ రావు మండిపడ్డారు. సమస్యల పరిష్కారం కోసం ఛలో సెక్రటేరియట్ పిలుపునిచ్చిన అంగన్ వాడీల పట్ల ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి, కర్కషంగా వ్యవహరించిన దుర్మార్గమైన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని మండిపడ్డారు. ఇప్పటికైనా కళ్లు తెరవండి, మీ పాలనను అన్ని వర్గాల ప్రజలు ఛీ కొడుతున్నారన్న విషయాన్ని గుర్తించండి. రెండు నెలలుగా పెండింగ్ లో ఉన్న అంగన్ వాడీల వేతనాలను చెల్లించాలని, అప్ గ్రేడ్ చేసిన మినీ అంగన్ వాడీలకు ఏడాదిగా పెండింగ్ లో ఉన్న పెంచిన వేతనాలను తక్షణం చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

## రిజైన్ చేసి హ్యాపీగా వెళ్లిపోవచ్చు... రెబల్ ఎంపీలకు టీఎంసీ ఘాటు సందేశం

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటు ఎంపీలు పలువురు స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయడం, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమితో కలిసి పనిచేయనున్నట్టు ప్రకటించడంపై ఆ పార్టీ అధినాయకత్వం తొలిసారి స్పందించింది. ఇది ముమ్మాటికీ నయవంచనేనని టీఎంసీ సీనియర్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ అన్నారు. మంగళవారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, ద్వంద్వ వైఖరి కలిగిన వ్యక్తులు పార్టీ నుంచి వెళ్లిపోవడమే మంచిదని అన్నారు. పార్టీ పట్ల అంతగా అసంతృప్తి ఉంటే వాళ్లు రాజీనామా చేయాలన్నారు.'రెండు రకాల వ్యక్తిత్వాలు కలిగిన వ్యక్తులు వెళ్లిపోతే మాకు కూడా చాలా సంతోషం. వెళ్లిపోవాలనుకునే వాళ్లు వెళ్లిపోవచ్చు. మాకెలాంటి అభ్యంతరాలులేవు. అయితే మీరు తృణమూల్ కాంగ్రెస్ పేరును మాత్రం తీసుకెళ్ల లేరు. ప్రజలకు నిజం ఏమిటో తెలుసు, వాళ్లు మావెంటే నిలుస్తారు' అని కల్యాణ్ బెనర్జీ అన్నారు. పార్టీతో ఎవరికైనా విభేదాలుండి పార్టీలో ఇమడలేమని అనుకున్నా, ఇందుకు బదులుగా ఎవరికైనా మద్దతు ఇవ్వాలని అనుకున్నా పార్టీకి రాజీనామా చేయడం కనీస నైతిక బాధ్యత అని అన్నారు. తిరుగుబాటు ఎంపీలు లోక్‌సభ స్పీకరుకు లేఖ రాసి ఉంటే అందులోని సమాచారం ఎందుకు బయటపెట్టడం లేదని కల్యాణ్ బెనర్జీ ప్రశ్నించారు. 'ఎంతమంది ఆ లేఖలో సంతకం చేశారో, ఎందరు చేయలేదో నాకు తెలియదు. దీనిపై ఎవరెవరు ఏమి మాట్లాడుతున్నారో కూడా తెలియదు. లేఖ రాసిన 24 గంటల తర్వాత కూడా ఎందుకు దానిలోని విషయాలను బహిరంగం చేయడం లేదు. ఎవరూ ఆ లేఖను చూడలేదు. ఇలాంటి కీలక విషయంలో నిజాయితీ అనేది అవసరం' అని అన్నారు. తిరుగుబాటు ఎంపీలకు మరో పార్టీతో విలీనం అయ్యేంత సంఖ్యాబలం లేదన్నారు. అందువల్ల ఏ ఒక్క ఎంపీని బీజేపీ తీసుకోదని ధీమా వ్యక్తం చేశారు.




## సింగరేణిని దోచుకుంటున్న ప్రభుత్వం: బీఆర్ఎస్ ఎమ్మెల్యే

హైదరాబాద్, జూన్ 09: సింగరేణి సంస్థ విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మండిపడ్డారు. సింగరేణి సంస్థను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని ఆయన స్పష్టం చేశారు. కానీ ఆ సంస్థను ప్రభుత్వమే దోచుకుంటుందని విమర్శించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. జూన్ 5వ తేదీన 26 లక్షల 28 వేల మెట్రిక్ టన్నులు బొగ్గు ఉందని ప్రెస్ రిలీజ్ చేశారని వివరించారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు చెబుతున్నారని పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11.00 గంటలకు ఆ బొగ్గు నిల్వలను చూపించాలని మంత్రి శ్రీధర్ బాబును ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. 3 లక్షలకు పైగా బొగ్గు నిల్వ ఉందన్నారని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తాను, మంత్రి శ్రీధర్ బాబు.. ఇద్దరమే అక్కడికి వెళ్తామన్నారు. బొగ్గు నిల్వ లేకపోతే తప్పు చేశామని ప్రభుత్వం ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సింగరేణి విషయంలో వేలు పెట్టలేదని గుర్తు చేశారు. సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సింగరేణిలో ఆయన వేలు పెట్టారని స్పష్టం చేశారు. రెండు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వలేని పరిస్థితి సింగరేణిలో నెలకొందన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎందుకు మాట్లాడలేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. సింగరేణిలో 26 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గుపై సీబీసీఐడీతో విచారణ జరిపేలా ఆదేశించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. రూ. 4 వేల కోట్ల ఓడీ ఎందుకు తీసుకున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని ఆయన బల్లగుద్ది ప్రశ్నించారు. దీనిపై కేంద్ర మంత్రులు బండి సంజయ్‌తోపాటు కిషన్ రెడ్డి కూడా బాధ్యత వహించాల్సి ఉందన్నారు. గతంలో సింగరేణిలో 20 వేల ఉద్యోగాలు ఉండే.. కేసీఆర్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కారుణ్య నియామకాలు కింద 16 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చారని వివరించారు. దీంతో ఆ సంస్థలోని 36 వేల మంది ఉద్యోగులు నష్టపోయేలా పరిస్థితి ఉందన్నారు. బొగ్గు లేకుండా ఎందుకు ఆదాయపు పన్ను కట్టారో చెప్పాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు.



## డీకేకు తప్పని తిప్పలు.. అసంతృప్తి వ్యక్తం చేస్తున్న మంత్రులు..



బెంగళూరు, జూన్ 9: కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివ కుమార్‌కు మంత్రుల నుంచి తిప్పలు తప్పటం లేదు. శాఖల కేటాయింపు విషయంలో సీనియర్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రామలింగారెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రెండు రోజులకే రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రామలింగారెడ్డి ఆకస్మాత్తుగా రాజీనామా చేయటం దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధిష్ఠానం కృష్ణ బైరే గౌడకు గ్రేటర్ బెంగళూరు డెవలప్‌మెంట్ ఫోర్ట్‌ఫోలియో కేటాయించింది. అయితే, ఆయన ఇప్పటివరకు ఆ శాఖ బాధ్యతలు తీసుకోలేదు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. రామలింగారెడ్డి ఫోర్ట్‌ఫోలియో విషయంలో నెలకొన్న సందిగ్ధత కారణంగా బైరే గౌడ ఇంకా పదవి బాధ్యతలు చేపట్టలేదు. రామలింగారెడ్డికి గ్రేటర్ బెంగళూరు డెవలప్‌మెంట్ ఫోర్ట్‌ఫోలియో ఇస్తానని అధిష్ఠానం మాటిచ్చింది. కానీ, ఆ శాఖను బైరే గౌడకు కేటాయించి.. రామలింగారెడ్డికి ఇరిగేషన్ శాఖ కేటాయించింది. దీంతో ఆగ్రహానికి గురైన రామలింగారెడ్డి జూన్ 5వ తేదీన పదవికి రాజీనామా చేశారు. ఇక, అప్పటినుంచి గ్రేటర్ బెంగళూరు డెవలప్‌మెంట్ ఫోర్ట్‌ఫోలియో విషయంలో సందిగ్ధత నెలకొంది. ఆ శాఖను రామలింగారెడ్డికి కేటాయిస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఫోర్ట్‌ఫోలియో విషయంలో క్లారిటీ తెచ్చుకోవడం కోసం అధిష్ఠానాన్ని కలవడానికి బైరే గౌడ ఢిల్లీ వెళ్లారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే రిజ్వాన్ కూడా ఢిల్లీ వెళ్లారు. త్వరలో క్యాబినెట్ విస్తరణ జరగనుంది. మంత్రి పదవి ఆశిస్తూ రిజ్వాన్ ఢిల్లీ వెళ్లారు. క్యాబినెట్‌లో 21 ఖాళీలు ఉండటంతో ఔత్సాహికులు తమ అదృష్టం పరీక్షించుకోవడానికి ఢిల్లీ బాటపడుతున్నారు. ఇది వరకే మంత్రి పదవి పొందిన వారు మాత్రం తమ శాఖల విషయంలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నేతల అసంతృప్తి కారణంగా డీకే శివకుమార్ ఇబ్బందుల్లో పడిపోయారు.

## దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలను ఎస్సీలుగానే గుర్తించాలి

### దళిత జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్




న్యూఢిల్లీ, జూన్ 9 దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలను ఎస్సీలుగానే గుర్తించాలని జాతీయ దళిత జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. దళితులు మతం మారినంత మాత్రాన వారి కులం మారినట్లు కాదన్నారు. క్రైస్తవం, ఇస్లాంలోకి వెళ్లిన దళితులను, ముస్లింలోని దూదేకుల, నూర్‌భాషా వర్గాలను ఎస్సీలుగా గుర్తించకపోతే భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఢిల్లీలోని ఏపీభవన్‌లో జాతీయ దళిత జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. మతం మారిన దళితులను టార్గెట్ చేస్తూ వారిపై కేంద్రంలోని బీజేపీ సర్కారు వివక్షను చూపుతోందని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆరోపించారు. ఎస్సీలపై దేశవ్యాప్తంగా దాడులు పెరుగుతున్నాయని, దీన్ని అరికట్టేందుకు అందరూ ఒక తాటిపైకి రావాల్సిన అవసరముందని మాజీ ఎంపీ హర్షకుమార్ పిలుపునిచ్చారు. జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్ దళిత క్రైస్తవులకు అనుకూలంగా నివేదిక ఇవ్వాలని గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు.

## రైతులకు బీజేపీ శనిలా తయారైంది: వేముల వీరేశం

హైదరాబాద్, జూన్ 9: తెలంగాణలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు బీజేపీ ఓ శనిలా తయారైందని విమర్శించారు. తెలంగాణ బీజేపీ నేతలు.. ప్రధాని మోదీకి చెప్పి ధాన్యం కొనుగోలు చేయిస్తారని రైతులు ఎదురు చూశారని తెలిపారు. 8 మంది బీజేపీ ఎంపీలతో రైతులకు ఎలాంటి లాభం లేదని వ్యాఖ్యానించారు. రైతుల ముందు మోదీనే మోకరిల్లిన చరిత్రను బీజేపీ నాయకులు మరిచిపోయారా అని ప్రశ్నించారు. నల్ల చట్టాలని వెనక్కి తీసుకున్న చరిత్ర మోదీది అంటూ వీరేశం వ్యాఖ్యానించారు. 15వ తేదీలోపు రాష్ట్రంలో ప్రతి గింజా కొనుగోలు చేస్తామని బీజేపీ ప్రకటించాలని.. లేదంటే బీజేపీ నాయకుల ఇళ్లు ధాన్యంతో నిండిపోతాయన్నారు. రైతుల కోపానికి బీజేపీ బలికాక తప్పదని హెచ్చరించారు. తెలంగాణలో బీజేపీకి రాజకీయ భవిష్యత్తు ఉండదన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టత ఉందని తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేసేది బీజేపీ అయితే.. బీజేపీకి బీ టీమ్‌గా బీఆర్ఎస్ పని చేస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం లేకున్నా పెద్ద ఎత్తున పంట వస్తే అసత్య రాజకీయ క్రీడకి తెరలేపారంటూ వేముల వీరేశం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.



# ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వే ప్రక్రియ లో జాయింట్ ఎల్‌పిఎంలు లేకుండా చూడాలి



## జిల్లాలో 45 లక్షల మొక్కల పెంపకం లక్ష్యాన్ని సాధించాలి
## జలధార - జలహారతి పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి
## జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలి
## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, జూన్ 09:- ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వే ప్రక్రియలో పొరపాట్లు లేకుండా నాణ్యతతో నిర్వహించాలని, జాయింట్ ఎల్‌పిఎంలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ నుండి రెవెన్యూ, ప్లాంటేషన్, హౌసింగ్, జలధార - జలహారతి, అక్షరాంధ్ర తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జాయింట్ ఎల్‌పిఎంలను ఒక గ్రామంలో 2 శాతం కన్నా ఎక్కువ ఉండకూడదన్నారు. జాయింట్ ఎల్‌పిఎంల వల్ల ప్రజలకు, అధికార యంత్రాంగానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు..పట్టాదార్ పాస్‌బుక్స్ జారీ, ఈ-కేవైసీ ప్రక్రియ, డ్రాఫ్ట్ మరియు తుది ఆర్ఓఆర్ తయారీ వంటి ప్రక్రియల్లో కనీసం 95 శాతం ఖచ్చితత్వం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు భూ యజమానులకు జాయింట్ ఎల్‌పిఎం వల్ల కలిగే ఇబ్బందులను వివరించి, ఫీల్డ్ స్థాయిలోనే వివాదాలను పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. మ్యుటేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సవరణలు, లావాదేవీలు లేదా వారసత్వ బదిలీలకు సంబంధించిన మ్యుటేషన్లను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. నోషనల్ ఖాతాలు, జీరో ఖాతాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకుండా చూసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. డీఎల్ఆర్ ప్రక్రియలో భూముల వర్గీకరణను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. సరైన పరిశీలన లేకుండా పట్టా భూములను ప్రభుత్వ భూములుగా, 22-ఏ భూములుగా లేదా డాటెడ్ ల్యాండ్లుగా నమోదు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని కలెక్టర్ తెలిపారు. భూ రికార్డుల నవీకరణలో ఖచ్చితత్వం, పారదర్శకత మరియు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి దశను జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రీ-సర్వే ప్రక్రియలో డేటా వెరిఫికేషన్‌ను అన్ని స్థాయిల్లో (ఖూా, ఎఖీూ, తహసిల్దార్) ఖచ్చితంగా పూర్తి చేసి జాయింట్ కలెక్టర్ కు పంపాలని సూచించారు. ఎక్స్టెంట్, యాజమాన్యం, ప్రభుత్వ భూములు, పట్టా భూములు, ఇనాం భూముల వివరాలు సరిచూసి పంపాలన్నారు.. ఫేజ్-1 నుంచి ఫేజ్-5 వరకు ఉన్న రీ-సర్వే గ్రామాల్లో వివిధ లాగిన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పట్టాదార్ పాస్‌బుక్‌ల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు..ఎఖీూ ఫీడ్‌బ్యాక్‌లో భూ యజమానులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సర్వేలు, విచారణలు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. తహసీల్దార్లు, వీఆర్ఓలు తప్పనిసరిగా నోటీసులు జారీ చేసి, రెండు పక్షాలకు సమాచారం ఇచ్చిన తర్వాతే సర్వేలు, విచారణలు నిర్వహించాలన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో అదనపు డబ్బులు వసూలు చేయలేదని 90% మంది చెప్పారని, ఈ శాతం 100%కు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. నోటీసుల జారీ, విచారణల నిర్వహణలో నిర్లక్ష్యం కొనసాగితే తహసీల్దార్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.. డీమ్డ్ ఫారెస్ట్ భూముల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసే ప్రక్రియలో మొత్తం 30,000 ఎకరాల్లో 27,476 ఎకరాలు నమోదు అయ్యాయని, మిగిలిన 2,422 ఎకరాల డేటా ఎంట్రీని 10 రోజుల్లో పూర్తి చేయాలన్నారు.పీజీఆర్ఎస్ (ఖఉఖీూ), మీ సేవ ద్వారా అందిన 22-ఏ డీ నోటిఫికేషన్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం పీజీఆర్ఎస్‌లో 300కు పైగా, మీ సేవలో 348 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి సుమారు ఒకటిన్నర నెలల గడువు ఇచ్చిన నేపథ్యంలో ప్రతి వారం కనీసం 100 కేసులను పరిష్కరించేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియను జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అదే విధంగా అధిక సంఖ్యలో ప్రజలకు ప్రయోజనం చేకూర్చే రెవెన్యూ సంబంధిత అంశాలను గుర్తించి మూడు రోజులలోపు ప్రత్యేక ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. ప్రజలకు మేలు చేసే అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. ప్లాంటేషన్ కు సంబంధించి జిల్లాలో భారీ స్థాయిలో మొక్కలను నాటే కార్యక్రమాలను చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో సుమారు 45 లక్షల మొక్కలు నాటడం లక్ష్య సాధనలో భాగంగా ఇప్పటికే 25 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని, అందులో డ్వామా ద్వారా 10 లక్షలు, అటవీ శాఖ ద్వారా 15 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఇంకా రెండు నెలల వ్యవధిలో అదనంగా 20 లక్షల మొక్కలను పెంచి సిద్ధం చేయాలని కలెక్టర్ జిల్లా అటవీ అధికారి (ఆఈూ)ను ఆదేశించారు. పెంచిన చిన్న మొక్కలను విద్యాశాఖ ద్వారా విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలోని స్వయం సహాయక సంఘాల (ాఊఉబ) సభ్యులకు కూడా ఒక్కొక్కరికి మొక్క అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఏడాది మొక్కల నాటే కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించి జిల్లాలో పచ్చదనాన్ని పెంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పంచాయతీరాజ్, రోడ్లు?భవనాల శాఖ (ఖీడః), ఆర్టీసీ తదితర శాఖలకు రహదారుల వెంట మరియు వారి ఆధీనంలోని సంస్థాగత ప్రాంగణాల్లో (ఎనిబబితిబిబీబితినీనిజీశ్రీ అజీఎజూబీబవబ) విస్తృతంగా మొక్కలు నాటాలన్నారు. వివిధ శాఖలు, సంస్థలకు అవసరమైన మొక్కల సంఖ్యపై ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జలధార - జలహారతి కి సంబంధించి జలకళ పనుల అమలులో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్ల గణనీయమైన పురోగతి సాధించామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం జలకళ పనుల్లో 91 శాతం పనులు గ్రౌండింగ్ దశకు చేరుకున్నాయని, ఇది అన్ని శాఖల సమిష్టి కృషి ఫలితమని కలెక్టర్ అభినందించారు. మిగిలిన పనులు కూడా వారం రోజుల్లో గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రౌండింగ్ పూర్తయిన పనులను త్వరితగతిన పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మొత్తం 3,383 పనులు గ్రౌండింగ్ అయినప్పటికీ, ఇప్పటివరకు సుమారు 800 పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా వేగవంతంగా పూర్తి చేసి, జలకళ పథకం కింద చేపట్టిన ప్రతి పనిని విజయవంతంగా ముగించాలన్నారు. . అదే విధంగా నీటి వనరుల అభివృద్ధిలో భాగంగా వివిధ సంస్థల సహకారంతో యంత్రాలను వినియోగించి 27 చెరువులకు సంబంధించిన ఫీడర్ కాలువలను శుభ్రం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ చర్యల వల్ల ఆయా చెరువులకు నీటి ప్రవాహం మెరుగుపడి, వాటిని నింపే అవకాశాలు పెరిగాయన్నారు. జిల్లాలో 28 ట్యాంకుల్లో 16 క్యాస్కేడ్ ట్యాంకులకు సంబంధించిన 34 ఫీడర్ ఛానల్లను శుభ్రపరిచి, మొత్తం 31 కిలోమీటర్ల మేర క్లియరెన్స్ పనులు పూర్తి చేశారన్నారు. అలాగే 1.81 లక్షల చదరపు మీటర్ల జంగిల్ క్లియరెన్స్, 60,656 క్యూబిక్ మీటర్ల డీ-సిల్టింగ్ పనులు చేపట్టారన్నారు. మొత్తం 1,412 గంటలపాటు యంత్రాలు పనిచేసి, 7,122 లీటర్ల ఇంధన వినియోగంతో సుమారు రూ.1.12 కోట్ల విలువైన పనులను ఉచితంగా చేశామన్నారు. హౌసింగ్ కు సంబంధించి ఇళ్ల నిర్మాణాలు పూర్తైన వాటికి ఐహెచ్ఎల్ఎస్ నిర్మాణాల్లో పురోగతి లేకపోవడం ఏంటని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.. కోసిగి లాంటి మండలాలు బాగా పురోగతి సాధిస్తుంటే మిగిలిన మండలాలు పురోగతి ఎందుకు లేదని ప్రశ్నిస్తూ, వెంటనే పురోగతి సాధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.యోగాంధ్ర కు సంబంధించి యోగాభ్యాసకుల రిజిస్ట్రేషన్ లక్ష్యాన్ని చేరుకునేందుకు మరింత కృషి చేయాలన్నారు. యోగా ట్రైనర్ల రిజిస్ట్రేషన్ కు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గూడూరు అర్బన్, ఎమ్మిగనూరు అర్బన్, హోళగుంద రూరల్, ఆదోని అర్బన్ లో వెంటనే యోగా కాంపిటీషన్ కార్యక్రమాలను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వెన్యూ లను మ్యాపింగ్ చేసే ప్రక్రియ ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అందరూ 1800 315 7008 టోల్-ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జూన్ 14 (ఆదివారం) ఉదయం 6:15 నుంచి 7:35 వరకు భారత ప్రభుత్వం నిర్వహించే యోగా డెమోన్స్ట్రేషన్ కార్యక్రమంలో వర్చువల్ విధానంలో అందరూ పాల్గొనాలన్నారు. మండలంలో ఉన్న యోగా సంఘాలు, యోగా అసోసియేషన్లు మరియు యోగా ఆసక్తిగల వ్యక్తులు "యోగా సంఘం" పోర్టల్‌లో నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొనేలా అన్ని యోగా సంస్థలకు సమాచారం ఇవ్వాలన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లకు 16,191 లక్ష్యం ఉండగా ఇప్పటికే 16,000 మంది నమోదు అయ్యారన్నారు. ఇంకా 130 మంది వాలంటీర్ల నమోదు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అక్షరాస్యత కార్యక్రమంలో లెర్నర్స్ నమోదు లక్ష్యం 1.87 లక్షలు కాగా ఇప్పటివరకు 46 వేల మంది మాత్రమే నమోదు అయ్యారన్నారు. ఇంకా 1.40 లక్షల మంది నమోదు చేయాల్సి ఉందని, వచ్చే వారం రోజుల్లో ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిరక్షరాస్యత అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుని కూలీ పనులు, చిన్న వ్యాపారాలు చేసుకునే వారిని గుర్తించి నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. మండలంలోని పాఠశాలలు, హాస్టళ్ల పనితీరును పర్యవేక్షించడం ఎంపీడీఓలు బాధ్యతేనని కలెక్టర్ తెలిపారు. ఎంపీడీఓలు స్వయంగా క్రమం తప్పకుండా పాఠశాలలు, హాస్టళ్లను సందర్శించి పరిస్థితులను పరిశీలించాలన్నారు. మండలంలో ఉన్న 10?12 పాఠశాలలు, హాస్టళ్లను వారానికి రెండు లేదా మూడు సందర్శనలు చేస్తే వాటి పనితీరుపై సమగ్ర అవగాహన పొందవచ్చన్నారు.. హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తక్షణమే నీటి నమూనాల పరీక్షలు (చిజీబివతీ ాజీఎజూశ్రీతినిణ) నిర్వహించాలన్నారు. అలాగే పిల్లలకు అవసరమైన టాయిలెట్లు, మంచాలు, ఫ్యాన్లు, లైట్లు వంటి ప్రాథమిక సౌకర్యాలు ఉన్నాయో లేదో పరిశీలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, డిఎఫ్ఓ శ్యామల, హౌసింగ్ పిడి నరసింహ రెడ్డి, డ్వామా పిడి నరసింహ రెడ్డి, డి ఆర్ డి ఏ పిడి రమణ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ ప్రభాకర్ రెడ్డి, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, డిడి అడల్ట్ ఎడ్యుకేషన్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెల లోపు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాలతో నెట్ జీరో హెల్తీ క్యాంపస్ లను ఏర్పాటు చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు , జూన్ 09:-స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల సాధనలో భాగంగా జిల్లాలో నెట్ జీరో హెల్తీ క్యాంపస్‌ల ఏర్పాటు ఈ నెల లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ స్వర్ణాంధ్ర ? స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల అమలుకు , నెట్ జీరో,హెల్తీ క్యాంపస్ సంబంధిత అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అల్ట్రా హెడెన్సిటీ మొక్కలు పెంచటానికి అనుకూలంగా ఉన్న 13 విద్యా సంస్థల్లో ఈనెల 19వ తారీకు లోపు మరియు ఈ నెలాఖరులోగా జిల్లాలోని మిగిలిన 37 విద్యాసంస్థలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, సంక్షేమ హాస్టళ్లు పర్యావరణ హిత కేంద్రాలుగా రూపుదిద్దుకోవడానికి అన్ని చర్యలు పూర్తి చేయటానికి వెంటనే తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నెట్ జీరో ఎనర్జీ లక్ష్యంతో నెడ్‌క్యాప్ ద్వారా సోలార్ ప్యానెల్ల ఏర్పాటుకు చర్యలు జరుగుచున్నవని పేర్కొన్నారు.రక రకాల మొక్కలతో జీవ వైవిధ్యాన్ని పెంపొందించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో స్థలం అందుబాటులో ఉన్న మేరకు పనులు ప్రారంభించాలని,ట్రైబల్ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్ తదితర శాఖలకు చెందిన విద్యాసంస్థల్లో వారి అవసరాలకు అనుగుణంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.నెట్ జీరో కార్యక్రమాల్లో భాగంగా బయో వేస్ట్, లిక్విడ్ వేస్ట్, గ్రీన్ వాటర్ నిర్వహణలో భాగంగా సోక్ పిట్లు, రైన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్లు,గ్రే వాటర్ పిట్ లు , కిచెన్ వేస్ట్ పిట్ లను నెల ఆఖరులోగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ పనులను ఎన్ఆర్ఈజీఎస్ పనుల ద్వారా రూరల్ లో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కర్నూలు, ఆదోని, యెమ్మిగనూరు ల లో మున్సిపల్ శాఖ ద్వారా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో " కన్హా హార్ట్ ఫుల్ నెస్ " సంస్థ మరియు రాష్ట్ర ప్రభుత్వం మధ్య నెట్ జీరో పర్యవేక్షణ కొరకు కుదిరిన ఒప్పంద పత్రాన్ని సంస్థ ప్రతినిధులు కళ్యాణ్ , వెంకటరెడ్డి , గంగాధర్ జిల్లా కలెక్టర్ కు అందజేశారు.ఈ సమావేశానికి డ్వామా పీడీ నర్సింహారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక , బీసీ వెల్ఫేర్ ప్రసూన , ట్రైబల్ వెల్ఫేర్ సురేష్ ,ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ , కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేష్ , సిపిఓ భారతి , పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి , అడిషనల్ కమిషనర్ కృష్ణ , డిపిఓ భాస్కర్ , ఎస్ ఎస్ ఎ ఏపీసి లోకరాజు , నెట్ జీరో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కళ్యాణ్ సెంటర్ కోఆర్డినేటర్ లు రామచంద్ర మిషన్ వెంకట్ రెడ్డి , గంగాధర్ , సంబందించిన అధికారులు , ఏపీఆర్జేసీ కోఆర్డినేటర్, పాల్గొన్నారు.




# వెన్నుపోటుకు రెండేళ్లు... ప్రజల ముందు నిజాలు : భూమన అభినయ్ రెడ్డి





తిరుపతివైసిపి అధినేత వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు తిరుపతి నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతి పద్మావతి పురంలోని వైసిపి పార్టీ కార్యాలయంలో వెన్నుపోటుకు రెండుళ్ళు అనే కార్యక్రమంలో భాగంగా ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేసి నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం చేసిన వైఫల్యాలు, నెరవేరని హామీలు, యువత, మహిళలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, అలాగే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడులను ఫోటోలు, ఆధారాల రూపంలో ప్రజల ముందుంచడం జరిగిందన్నారు. అలవిగాని హామిలిచ్చి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ, ప్రజలను మోసం చేస్తున్నదని విమర్శించారు. ప్రజలకిచ్చిన మాటలను గుర్తు చేస్తూ, ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ డాక్టర్ శిరీష యాదవ్, తిరుపతి నగర వైసిపి అధ్యక్షులు మల్లం రవి చంద్రా రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్హెచ్ 340 సి రహదారి విస్తరణ పనులను ఆగస్టు నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టండి

## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు, జూన్ 09:- ఎన్హెచ్ 340 సి రహదారి విస్తరణ పనులను ఆగస్టు నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్హెచ్ 340 సి లో భాగంగా నంద్యాల చెక్ పోస్ట్ నుండి నందికొట్కూరు రోడ్డు వరకు చేపడుతున్న పనుల పురోగతి పై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల చెక్ పోస్ట్ నుండి నందికొట్కూరు రోడ్డు వరకు చేపడుతున్న మొత్తం 9 కిలోమీటర్ల రహదారి విస్తరణ ప్రాజెక్టులో ఇప్పటివరకు సుమారు 7.5 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, మిగిలిన 1.5 కిలోమీటర్లలో జరుగుతున్న పనులలో పురోగతి తీసుకొని రావాలన్నారు. మిగిలిన 1.5 కిలోమీటర్ల భాగంలో సుమారు కిలోమీటర్ మేర పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయని అధికారులు కలెక్టర్ కు వివరించారు. మిగిలిన 500 మీటర్ల విభాగంలో కూడా కేవలం 300 మీటర్ల మేర మాత్రమే సమస్యాత్మక ప్రాంతం ఉందని, ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఆలయ ప్రాంతం వద్ద ఆలయం కారణంగా పనులలో కొంత ఆలస్యం జరుగుతోందని అధికారులు కలెక్టర్ దృష్టికీ తీసుకొని రాగా, స్థానిక ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, పరస్పర అవగాహనతో సమస్యను పరిష్కరించి ప్రాజెక్టును పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పూర్తికావడంతో ప్రాంతీయ రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ వసతులు అందుబాటులోకి రానున్నాయన్నారు.సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, నేషనల్ హైవే, కర్నూలు ఈఈ విజయభాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మూడు మృతదేహాల గుర్తింపు

విశాఖపట్నం, విశాఖ స్టీల్ప్లాంట్ ప్రమాద ఘటనలో ముగ్గురి మృతదేహాలు గుర్తింపు పూర్తయింది. భానుకుమార్, రమణ, అప్పలరాజు, మృతదేహాలను అధికారులు గుర్తించారు. మిగిలినవారి మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నందున.. డిఎన్ఏ పరీక్షల కోసం బాధిత కుటుంబాల నుంచి నమూనాలు సేకరించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**